'ఆరోగ్య సురక్ష' తో పేదలకు భరోసా

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- వైద్య శిబిరాలకు విశేష స్పందన



భవాని గార్డెన్స్ వైద్య శిబిరంలో పేషెంట్లకు మందులు అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ రజని

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి సచివాలయానికి సంబంధించి భవాని గార్డెన్స్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ చల్లా రజని నేతృత్వంలో వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 265 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.ఎల్.శాంతి తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గవర నాయుడు, ఫార్మాసిస్ట్ సింహాచలం, పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, కణితి చిరంజీవి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

271 మందికి వైద్య సేవలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం న్యూ వెంకటేశ్వర కాలనీ(244) సచివాలయానికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ పర్యవేక్షణలో స్పెషలిస్టు వైద్యులు రాకేష్, శరత్, సుజిత్‌బోస్, మెడికల్ ఆఫీసర్లు 271 మందిని పరీక్షించి అవసరమైన రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆప్తాల్మిక్, దంత వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. 16 మందిని కంటి శస్త్రచికిత్స కోసం రిఫర్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ వైద్య శిబిరాన్ని ప్రారంభించి, వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

మురళీనగర్: ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచించారు. 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. ఉచితంగా ఇస్తున్న మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. వైద్యాధికారి కేపీ నాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆర్థోపెడీషియన్, డెర్మటాలజిస్ట్, జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. గురువారం ఒక్కరోజే 345 మందికి పరీక్షలు చేయగా.. నాలుగు రోజుల్లో మొత్తం 1,257 మందికి పరీక్షలు నిర్వహించారు.

వైద్య పరీక్షల పరిశీలన

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో గురువారం 289 వుడా కాలనీ సచివాలయానికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని వైద్య పరీక్షలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థో, జనరల్, పల్మనాలజీ వంటి తదితర విభాగాల డాక్టర్లు వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 25వ వార్డు 133 సచివాలయం పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్న వారిని ఆప్యాయంగా పలకరించారు. ఉచితంగా పంపిణీ చేసిన మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆరోగ్య సమస్యలతో బాధపడకూడదన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. డాక్టర్ మన్మోహన్, స్పెషల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఎస్.ఎస్.వి.అప్పారావు, యూత్ ప్రెసిడెంట్ ఉప్పాడ సన్నీ, సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్, ఉషశ్రీ



49వ వార్డు వైద్య శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న కె.కె.రాజు



51వ వార్డు వైద్య శిబిరంలో పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న రెయ్యి వెంకటరమణ

పేదలకు ఉపయోగకరం



మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చాను. వైద్యులు మంచిగా పరీక్షలు చేసి మోకాల వ్యాధులపై వివరించారు. అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఇటువంటి శిబిరాలు మాలాంటి పేదోళ్లకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– పి.చిన్నమ్మలు, గజపతినగర్, ఊర్వశి జంక్షన్

వైద్యుల సేవలు బాగున్నాయి



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యుల సేవలు చాలా బాగున్నాయి. మాతో మర్యాదపూర్వకంగా మెలిగారు. ఆరోగ్య సమస్యలు చెబితే ఓపిగ్గా విన్నారు. ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు, ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్యశ్రీ ఉన్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు.

– సిహెచ్.వెంకటరెడ్డి, సూర్యానగర్–2, ఐటీఐ జంక్షన్

కొండవాలులో విద్యుత్ వెలుగులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్, జైభారత్‌నగర్, శ్రీనివాస్‌నగర్, బాపూజీనగర్, జవహర్‌లాల్‌నగర్, మహాత్మాగాంధీ నగర్ కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ సాయినాథ్ ఆధ్వర్యంలో గురువారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు వార్డులో పర్యటించారు. కొండవాలులో విద్యుత్ దీపాల సమస్య ఉందంటూ.. ప్రజలు కార్పొరేటర్‌కు వినతిపత్రాలు అందించారు. దీనిపై ఆమె ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ లైట్ల ఏర్పాటుకు కృషి చేశారు.

నవంబర్ 25న విరాట్ హిందూ సమ్మేళన్ వేడుక



మాట్లాడుతున్న డి.ఎస్.వర్మ

సీతమ్మధార: హిందూ సమాజాన్ని కాపాడుకోవాలనే నినాదంతో విరాట్ హిందూ సంఘ్ ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు డి.ఎస్.వర్మ తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ నరసింహ క్షేత్రం సింహాచలం లాంటి పుణ్యప్రదేశం, దక్షిణ భారతదేశంలో లక్ష్మీదేవి, కనకమహాలక్ష్మిగా కొలువైన విశాఖ.. విభిన్న సంస్కృతులు, వివిధ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు ఇచ్చే ప్రదేశమన్నారు. విశ్వనగరంలో నవంబర్ 25న విరాట్ హిందూ సంఘ్ సమ్మేళన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హరి కేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో ఈ వేడుకను జరుపుతున్నామన్నారు.

ఈ సమ్మేళన్‌లో హనుమాన్ శోభాయాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధార్మిక వేత్తలకు హిందూ ధార్మిక కార్యక్రమాలకు ప్రధాన సింహద్వారంగా ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కపిల్ అగర్వాల్, రాఘవేంద్ర మిశ్రా, కె.హెచ్.వి.శర్మ, దుర్గాప్రసాద్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాలధారులకు అన్నప్రసాద వితరణ ప్రారంభం



స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: యెరిమేలి అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం హైవే వద్ద పోర్టు ఆస్పత్రి ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో మాలధారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బొక్కాకుల లక్ష్మీ వెంకటరావు పాల్గొని స్వాములు, భవానీలకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా పీఠంలో వినాయకుడు, అయ్యప్ప, లక్ష్మీదేవిలకు పూజలు చేశారు. డిసెంబర్ 2 వరకు 45 రోజుల పాటు ప్రతి రోజూ మాలధారులకు అన్నప్రసాద వితరణ చేస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

ఉద్యానవనంలో మహనీయుల కుడ్య చిత్రాలు



వాకర్స్ పార్కులో క్లబ్ గోడపై మహనీయుల చిత్రాలు వేస్తున్న కళాకారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో మహనీయుల కుడ్య చిత్రాల పెయింటింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులు, చిన్నారులు, విద్యార్థులు, వాకర్స్‌లో దేశభక్తిని కలిగించేలా పలువురు మహనీయుల కుడ్య చిత్రాలు ఏర్పాటు చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు తదితరుల చిత్రాలను వాకర్స్ పార్కు చిత్రాలకు సంబంధించి గోడలపై పెయింటింగ్ పనులు చేస్తున్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో చిత్రకారులు చిత్రాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. త్వరలోనే వీటిని పూర్తి చేసి సందర్శనకు ఏర్పాటు చేస్తామని చంద్రమౌళి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మణి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో తన అన్నయ్యతో కలిసి నివసిస్తున్న మణి(21) బుధవారం అర్ధరాత్రి దాటాక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు, అన్నయ్య కలిసి అదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మణి సోదరుడు టింకు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధ బాధితులకు నివాళి



యుద్ధంలో అశువులు బాసిన వారికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీతమ్మధార: యుద్ధంలో అశువులు బాసిన పాలస్తీనియన్లకు పౌర, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ద్వారకానగర్ గురజాడ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ యుద్ధాలు వద్దు.. ప్రపంచ శాంతి ముద్దు అంటూ పలువురు నినాదాలు చేశారు. తాగునీరు, మందులు, నిత్యావసర వస్తువులు పాలస్తీనాకు సరఫరా కానీయకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. జె.వి. సత్యనారాయణమూర్తి, ఎం.పైడిరాజు, ఎ.విమల, శ్రీరామమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. విశేష అలంకరణలు



లలితా పీఠంలో లలితా కామేశ్వరి దేవిగా అమ్మవారు



బాలా త్రిపురసుందరి అలంకరణలో పార్వతీదేవి



మురళీనగర్‌లో కాళికాదేవి అలంకరణలో లలితాంబిక

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో అమ్మవారు లలితా కామేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, గోపూజ, శతచండీ పారాయణ, మహాలింగార్చన, రుద్రాభిషేకం, అమ్మవారి గర్భాలయంలో శ్రీచక్ర నవావరణ పూజలు చేశారు. సాయంత్రం వారాహి, లలితా, చండీ హోమాలు జరిగాయి. మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సరస్వతీ దేవి అలంకరణలో లలితా దేవి దర్శనమిస్తారని, ఉదయం సామూహిక పూజలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

బాలా త్రిపురసుందరిగా పార్వతీదేవి

సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి బాలా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శివాజీశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, గాయత్రి నామార్చన, చండీ హోమం, అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలితా పారాయణ పఠించారు. శుక్రవారం సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న బాలికలు

కాళికాదేవిగా లలితాంబిక

మురళీనగర్: మురళీనగర్ లలితాదేవి ఆలయంలో గురువారం అమ్మవారిని కాళీకాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గారెలు ప్రసాదంగా సమర్పించారు. లలిత డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. ఆలయం కార్యదర్శి సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



విజయదుర్గమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కుంకుమ పూజలు, దీపాలంకరణ సేవ నిర్వహించారు. భవానీ మాలధారులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో విశాఖ నుంచి పరిపాలన సాగించనున్న నేపథ్యంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ బండారు గుప్తాజీ, రాజారెడ్డి, రాయుడు శ్రీను, రామిరెడ్డి, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామిగా ప్రసన్న వేంకటేశ్వరుడు



కాళికాదేవిగా మహాలక్ష్మి దుర్గమ్మ



పాండురంగ అవతారంలో వేంకటేశ్వర స్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో దేవీ నవరాత్రులు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం మహాలక్ష్మి దుర్గమ్మవారు కాళికాదేవి అలంకరణలో, ప్రసన్న వేంకటేశ్వర స్వామి పాండురంగ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వేంకటేశ్వరస్వామి తిరువీధి ఘనంగా జరిగింది.

నాణ్యత లేని ఉల్లి



రైతుబజార్‌లో కుళ్లిన ఉల్లిపాయలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లలో గురువారం విక్రయించిన ఉల్లిపాయల్లో నాణ్యత లోపించింది. కిలో ఉల్లి రూ.37 విక్రయిస్తున్నా.. నాణ్యత లేక కొన్ని కుళ్లిపోవడంతో వినియోగదారులు కొనుగోలు చేయకుండా వెనుదిరిగారు. మార్కెటింగ్ శాఖ అధికారులు దృష్టి సారించి నాణ్యమైన ఉల్లిపాయాలు విక్రయించేలా చూడాలని పలువురు కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నామినీలకు బీమా సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో సహజ మరణం పొందిన ఇద్దరు, ప్రమాదంలో మరణించిన మరొకరి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయంగా వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. 130 సచివాలయానికి చెందిన ఇమంది సన్యాసిరావు ప్రమాదంలో మరణించాడు. 133 సచివాలయం పరిధిలో షేక్ మదీనా, పి.శ్రీను సహజ మరణం పొందారు. గురువారం మృతుల నామినీలకు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, ఎస్.ఎస్.వి.అప్పారావు, యూత్ ప్రెసిడెంట్ సన్నీ, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధి రైల్వే క్వార్టర్స్, వుడా లేఅవుట్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైల్వే క్వార్టర్స్, మద్రిపాలెం మెయిన్ రోడ్డు, గవర వీధి, గొల్లల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వాకర్స్ పార్కులో విద్యుత్ లైట్ల ఏర్పాటు



వెలుగుతున్న విద్యుత్ లైటు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో విద్యుత్ లైట్ల ఏర్పాటుకు వీధిలైట్ల విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. పార్కులో విద్యుత్ లైట్లు వెలగక సాయంత్రం వేళ వాకర్స్, సందర్శకులు ఇబ్బందులు పడేవారు. దీనిపై వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధికారులను సంప్రదించిన మేరకు నాలుగు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. దీనిపై వాకర్స్, వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవుడి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలపై ప్రజల్లో అనురక్తి కలిగించే ఉద్దేశంతో ఈ నెల 22 నుంచి 28 వరకు ఉత్సావాలు నిర్వహిస్తామన్నారు. 22న వైభవుడికి ప్రత్యేక పూజల అనంతరం, కోలాటం, అమ్మవారికి అర్చన, తీర్థగోష్ఠి జరుగుతాయి. 23న పద్మావతి అమ్మవారికి అర్చన అనంతరం బి.యతిరాజు భాగవతాచార్యలచే హరికథా కాలక్షేపం ఉంటుంది. 24న ఆధ్యాత్మిక ప్రసంగాలు, 25న జమ్మి వాత్సల్య బృందం అన్నమాచార్య కీర్తనలు, 26న భరతనాట్యంతో నృత్య సేవ, 27న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో భజన, సత్సంగం, 28న పౌర్ణమి సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. 28న చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9 గంటల వరకు మాత్రమే వైభవుడి దర్శనం ఉంటుంది.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



980వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.